క్లుప్తంగా

నేడు రాజన్న వర్ధంతి

నరసరావుపేట: జిల్లా కేంద్రమైన నరసరావుపేటలో దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్ వర్ధంతిని పురస్కరించుకుని ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి సారథ్యంలో శనివారం పలు చోట్ల కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఉదయం 8.30కు ప్రకాష్‌నగర్ 60 అడుగులరోడ్డులోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పిస్తారు. వినుకొండలో మహానేత, దివంగత ముఖ్యమంత్రి స్వర్గీయ డాక్టర్ వై.ఎస్.రాజశేఖరరెడ్డి 14వ వర్ధంతి సందర్భంగా స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో శనివారం ఉదయం 9.30 గంటలకు వర్ధంతి కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పట్టణ వైఎస్సార్ సీపీ అధ్యక్షులు పీఎస్ ఖాన్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో నలుగురికి గాయాలు

యడ్లపాడు: రోడ్డు ప్రమాదంలో నలుగురికి గాయాలు కాగా ఒకరి పరిస్థితి విషమంగా ఉన్న సంఘటన గురువారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. మైదవోలు గ్రామానికి చెందిన వెంకటేశ్వర్లు, బాలతోటి కిషోర్‌లు పల్సర్ వాహనంపై గుంటూరు వైపు వెళ్తున్నారు. అదే సమయంలో యడ్లపాడు గ్రామానికి చెందిన కుంచాల సాయిబాబు, పల్లపు వీరాంజనేయులు బుల్లెట్‌పై అదేమార్గాన ప్రయాణిస్తూ వెనుక నుంచి పల్సర్‌ను ఢీకొన్నారు. దీంతో రెండు వాహనాలు అదుపు తప్పడంతో నలుగురు కిందపడిపోయారు. గురువారం రాత్రి 11 గంటల సమయంలో జరిగిన ఈ ప్రమాదంలో నలుగురికి గాయాలు కాగా కుంచాల సాయిబాబు అపస్మారక స్థితికి వెళ్లడంతో విషమంగా ఉన్నట్లు ఎస్‌ఐ సురేష్ తెలిపారు.

నాలుగు సంవత్సరాలు.. 4272 నూతన పింఛన్లు..

- ప్రతినెలా 11,310 మందికి రూ.3.10 కోట్లు అందజేత
- టీడీపీ ప్రభుత్వంలో 7038 మందికే పింఛన్లు


నూతన పింఛనుదార్లకు నగదు, మంజూరు పత్రాలను అందజేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి

నరసరావుపేట: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ గత నాలుగేళ్ల కాలంలో పురపాలక పరిధిలో 4272 మందికి నూతన పింఛన్లు మంజూరుచేసి వారికి ప్రతినెలా రూ.1.02 కోట్ల సొమ్ము అందజేస్తుందని ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం సాయంత్రం పురపాలక కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రస్తుతం నూతనంగా మంజూరైన 253 సామాజిక భద్రతా పింఛన్ల లబ్ధిదారులకు నగదుతో పాటు మంజూరు పత్రాన్ని అందజేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రస్తుతం వైఎస్సార్ పింఛన్ పథకం ద్వారా పురపాలక పరిధిలోని 34 వార్డులకు చెందిన 11,310 మందికి ప్రతినెలా రూ.3.10 కోట్లు అందజేస్తుందన్నారు. 2019 టీడీపీ ప్రభుత్వం ముగిసే నాటికి కేవలం 7038 మందికి రూ.1.40 కోట్లు మాత్రమే అందజేసేవారన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పడిన దగ్గరి నుంచి అర్హులైన వారందరికీ అందజేయాలనే దృక్పథంతో దరఖాస్తు చేసుకున్న అర్హులైన వారికి ప్రతి ఆరు నెలలకు ఒకసారి అందజేస్తున్నామన్నారు. 2019-20లో నూతనంగా 2012 పింఛన్లు పెంచి వారికి రూ.43.51 లక్షలు అదనంగా ఇచ్చామన్నారు. అలాగే 2020-21లో 950 మంది నూతన పింఛన్‌దారులకు రూ.23.75 లక్షలు, 2021-22 ఏడాదిలో 123 మంది నూతన పింఛన్‌దారులకు రూ.3.75 లక్షలు, 2022-23 జనవరి నెలకు సంబంధించి 280 మందికి రూ.7.92 లక్షలు, 2022-23 జూన్ వరకు మరో 654 మంది నూతన పింఛన్‌దార్లకు అవకాశం కల్పించి రూ.16.35 లక్షలు, 2022-23 సెప్టెంబరుకు 253 మంది నూతన పింఛన్‌దార్లకు రూ.6.95 లక్షలు అదనంగా అందజేస్తున్నామన్నారు.

ఈ విధంగా ఈ నాలుగేళ్లలో 4272 మంది నూతన పింఛన్‌దార్లకు రూ.1.02 కోట్లు అందజేస్తున్నామన్నారు. కార్యక్రమంలో పల్నాడు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ చైర్మన్ మిట్టపల్లి రమేష్, షేక్ కార్పొరేషన్ చైర్మన్ ఆషాబేగం ఖాజావలి, మున్సిపల్ ఎం.ఇ డి.శ్రీనివాసరావు, డీఇ ఓ. శ్రీనివాసరావు, మాజీ కౌన్సిలర్ గోగుల శంకరమ్మ, వైఎస్సార్ సీపీ నాయకులు షేక్ ఖాదర్ బాష, కాకుమాను సదాశివరెడ్డి, కాకుమాను కోటిరెడ్డి పాల్గొన్నారు.

‘ఆశ ’లకు విద్యార్హతలు ఉండేలా చర్యలు

- జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ జి.శోభారాణి
- 30 మంది ఆశలకు సర్టిఫికెట్లు పంపిణీ


కార్యాలయంలో ఆశలకు సర్టిఫికెట్లు పంపిణీ చేస్తున్న డీఎండీహెచ్‌వో డాక్టర్ శోభారాణి

నరసరావుపేట: ఏపీ ఓపెన్ స్కూలు ద్వారా ఆశ కార్యకర్తలు అందరూ తగిన విద్యార్హత ఉండేలా చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ జి.శోభారాణి వెల్లడించారు. శుక్రవారం పల్నాడు రోడ్డులోని డీఎండీహెచ్‌వో కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఏపీ సార్వత్రిక విద్యాపీఠం ద్వారా ఓపెన్ బేసిక్ ఎడ్యుకేషన్‌లో లెవెల్-బి,సి పరీక్షలు రాసి ఉత్తీర్ణులైన ఆశ కార్యకర్తలకు సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పరీక్షలు రాసిన 39 మంది ఆశ కార్యకర్తలు వందశాతం ఉత్తీర్ణత సాధించటం చాలా సంతోషంగా ఉందన్నారు. ఆశలు అందరికీ కూడా తగిన విద్యార్హతలు ఉండేలా ఓపెన్ స్కూల్ ద్వారా వారికి దగ్గరగా ఉన్న స్కూల్స్‌లో టీచర్లను ఏర్పాటు చేయించి బాగా చదువుకునేలా చేస్తున్నామన్నారు. ఆశలు అందరూ మంచిగా పని చేసి పల్నాడు జిల్లాకు మంచిపేరు తీసుకుని రావాలని చెప్పారు. డీసీఎం నందిగం సురేష్ పాల్గొన్నారు.

ఘన, వ్యర్థాల నిర్వహణపై అవగాహన


అవగాహన కల్పిస్తున్న ఐటీసీ, సెర్ప్ ప్రతినిధులు

వినుకొండ(నూజెండ్ల): ఐటీసీ బంగారు భవిష్యత్, సెర్ప్ సంస్థల ఆధ్వర్యంలో నూజెండ్ల మండలంలోని తలార్లపల్లి గ్రామంలో ఘనద్రవ వ్యర్థాల నిర్వహణపై ఒకరోజు శిక్షణ తరగతులు శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా జిల్లా నీరు పారిశుద్ధ్య కమిటీ హెచ్‌ఆర్‌డీ రమేష్ పాల్గొని మాట్లాడుతూ ప్రతిఒక్కరూ పరిశుభ్రంగా జీవించాలంటే ఆరోగ్యంగా ఉండాలంటే ప్రతి గ్రామంలో చెత్త నుంచి సంపద కేంద్రాలు, సామాజిక ఇంకుడు గుంతలు, మురుగునీరు నిర్వహణ తప్పనిసరిగా ఉండాలన్నారు. ప్రభుత్వం చేపట్టే జగనన్న స్వచ్ఛ సంకల్ప కార్యక్రమంలో భాగంగా మరుగుదొడ్ల నిర్వహణ, రక్షిత మంచినీటి సేకరణకు ఎస్‌బీఎం, జేజేఎం కార్యక్రమాలు తప్పనిసరిగా అమలు జరగాలని కోరారు. ఐటీసీ-సెర్ప్ జిల్లా కోఆర్డినేటర్ శ్రీనివాస్ చెత్త సురక్షిత నిర్వహణ, మరుగుదొడ్లు మొదలైన వాటిపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. కార్యక్రమంలో సర్పంచ్ కిష్టం ఏడుకొండలు, ఎంపీటీసీ జక్కిరెడ్డి అంజమ్మ వెంకటేశ్వర రెడ్డి, మండల రీసోర్స్ కోఆర్డినేటర్ కంచర్ల సుబ్బరామయ్య, పంచాయతీ కార్యదర్శులు చెన్నారావు, వెంకటేశ్వర్లు, సీవో ప్రదీప్, ఐటీసీ-సెర్ప్ రీసోర్స్ పర్సన్ బొల్లయ్య, గ్రామపెద్దలు లేళ్ల అంజిరెడ్డి, గాలం నాగేశ్వరరావు, అంగన్‌వాడీ టీచర్లు పద్మ, రత్నమ్మ, సామ్రాజ్యం, సీతమ్మ, భాగ్యలక్ష్మి, వెలుగు సిబ్బంది పాల్గొన్నారు.

అథ్లెటిక్స్‌లో కృష్ణవేణి విద్యార్థినులకు పతకాలు


విద్యార్థినులను అభినందిస్తున్న కళాశాల సిబ్బంది

నరసరావుపేట ఈస్ట్: ఉమ్మడి గుంటూరు జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గుంటూరు బీఆర్ స్టేడియంలో గురువారం నిర్వహించిన జిల్లాస్థాయి పోటీలలో కృష్ణవేణి డిగ్రీ కళాశాల విద్యార్థులు 10 పతకాలు సాధించినట్టు కళాశాల ప్రిన్సిపల్ నాతాని వెంకటేశ్వర్లు శుక్రవారం తెలిపారు. తమ విద్యార్థినిలు అండర్-18 విభాగంలో ఎం.త్రివేణి షాట్‌పట్, డిస్కస్‌త్రోలో బంగారు, ఎం.హేమలత 100 మీటర్ల పరుగులో రజితం, ఎం.శిరీష 200 మీటర్ల పరుగులో రజితం, అండర్-20 విభాగంలో ఎ.రమ్య 100, 200 మీటర్ల పరుగులో బంగారు, సిహెచ్.అలేఖ్య 400, 800 మీటర్ల పరుగులో బంగారు, జె.వినోదిని డిస్కస్‌త్రోలో బంగారు, ఎం.కావేరి 400 మీటర్లులో కాంస్య పతకం సాధించారని వివరించారు. విద్యార్థినులను కళాశాల డైరెక్టర్ కె.నాసరయ్య, ప్రిన్సిపల్ నాతాని, వ్యాయామ అధ్యాపకుడు ఈదర ఆదిబాబు అభినందించారు.

సంక్షిప్త వార్తలు

■ రుణమేళాపై సమీక్ష

బొల్లాపల్లి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జగనన్న పాల వెల్లువలో భాగంగా రుణమేళా కార్యక్రమం ప్రణాళికపై ఇన్‌చార్జి ఎంపీడీఓ షేక్ జిలానీబాషా అధ్యక్షతన సంబంధిత శాఖల అధికారులు సమీక్ష నిర్వహించారు.

■ పౌష్టికాహారం తీసుకోవాలి

బొల్లాపల్లి: మండల కేంద్రంలో పోషణ మాసోత్సవాలు శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సీ కాలనీలో అంగన్‌వాడీ సెంటర్‌లో పోషకాహారంపై అవగాహన నిర్వహించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీఓ షేక్ జిలానీబాషా పాల్గొన్నారు.

■ ఘనంగా ఎల్‌ఐసీ వార్షికోత్సవం

వినుకొండ(నూజెండ్ల): పట్టణంలోని ఎల్‌ఐసీ కార్యాలయంలో ఎల్‌ఐసీ 67వ వార్షికోత్సవ వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో సీనియర్ బ్రాంచి మేనేజర్ బి.లక్ష్మానాయక్ ముఖ్య అతిథిగా పాల్గొని కేక్ కట్ చేసి సిబ్బందికి, ఏజెంట్లకు, కస్టమర్స్‌కు స్వీట్స్ పంచిపెట్టారు.

■ పౌష్టికాహార మాసోత్సవాలు

వినుకొండ(నూజెండ్ల): పట్టణంలోని ఎ-సెక్టార్ పరిధిలో గల హనుమాన్‌నగర్ అంగన్‌వాడీ కేంద్రం నందు సీడీపీవో ఎం.అనురాధ అధ్యక్షతన పౌష్టికాహార మాసోత్సవాలను ఘనంగా నిర్వహించారు.

■ అవగాహన సదస్సు

శావల్యాపురం: మండలంలోని కారుమంచి గ్రామ సచివాలయం పరిధిలో జగనన్న పాలవెల్లువ కార్యక్రమంలో భాగంగా అమూల్ పాల ఉత్పత్తిదారులకు రుణామేళా అవగాహన సదస్సు శుక్రవారం నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ మల్లావరపు విశ్రాంతం, పశువైద్యాధికారులు పాల్గొన్నారు.

■ 65 శాతం పింఛన్లు పంపిణీ

శావల్యాపురం: వైఎస్సార్ సామాజిక పింఛన్లు పంపిణీ కార్యక్రమం శుక్రవారం సాయంత్రం నాటికి 65 శాతం పూర్తి అయినట్లు ఎంపీడీవో పేరుమీనా సీతారామయ్య తెలిపారు మండలంలో15 గ్రామ పంచాయతీల్లో 5785 మంది పింఛనుదారులు ఉండగా ఆయా గ్రామాల్లోని వలంటీర్లు మొబైల్ యాప్‌లో బయోమెట్రిక్ విధానంలో పింఛను నగదు అందజేశారన్నారు.

■ బీఎల్‌ఓలతో సమీక్ష

బొల్లాపల్లి : ఓటరు సర్వే నిష్పక్షపాతంగా, పారదర్శకంగా నిర్వహించాలని వినుకొండ నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి కె.శ్రీరాములు బిఎల్‌ఓలకు ఆదేశించారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో బిఎల్‌వోలతో సమీక్ష నిర్వహించారు. అనంతరం వెల్లటూరు గ్రామంలో ఓటరు సర్వేపై పరిశీలన చేశారు. ఆయన వెంట ఇన్‌చార్జి తహశీల్దార్, ఎఆర్‌ఓ వి.సుధాకర్‌శర్మ, బీఎల్‌వోలు తదితరులు ఉన్నారు.

■ ప్రకృతి వ్యవసాయంతో ఆదాయం

నరసరావుపేట రూరల్: ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో వర్షాభావ పరిస్థితుల్లో రైతులు ఆదాయం పొందవచ్చని జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ కె.అమలకుమారి తెలిపారు. జిల్లా కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. కార్యక్రమంలో అడిషనల్ డీపీఎం ప్రేమరాజు, ఎన్ఎఫ్ఏలు అప్పలరాజు, సౌజన్య నంద కుమార్, భవానీరాజ్, సైదయ్య, మేరి పాల్గొన్నారు.

■ ఎలిమినేషన్ జాబితా పరిశీలన

రొంపిచర్ల: మండలంలోని ఆరేపల్లి, రామిరెడ్డిపాలెం, బుచ్చిబాపన్నపాలెం, రొంపిచర్ల గ్రామాల్లో ఓటర్ల జాబితా నుండి తొలగించబడిన ఓటర్ల జాబితాపై ప్రత్యేక అధికారి పుడా వైస్ చైర్మన్ గజ్జల శ్రీనివాస రెడ్డి శుక్రవారం పరిశీలించారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు పరిశీలన చేస్తున్నామన్నారు.

■ ఆక్రమణల తొలగింపు

వినుకొండ(నూజెండ్ల):ఉప్పలపాడు గ్రామంలో గల అభినేటి కుంట ఆక్రమణలను తొలగించి ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు ఆధ్వర్యంలో మండల సర్వేయర్ చండీరాణి, సర్వే సిబ్బంది సర్వే చేసి చుట్టూ హద్దులను ఏర్పాటు చేశారు. సర్వే నంబరు 150లో గలో 20.76 ఎకరాలకుంటలో ఆక్రమణలను తొలగించడం జరిగిందని సర్వేయర్ తెలిపారు.

■ 100 మందికి కొత్త పింఛన్లు

రొంపిచర్ల: స్థానిక గ్రామ సచివాలయాలలో శుక్రవారం వైఎస్సార్ పింఛన్ యోజనా పథకం కింద కొత్తగా మంజూరైన వంద మందికి పింఛన్‌లు పంపిణీ చేశారు.

■ నేడు వైఎస్సార్ విగ్రహావిష్కరణ

నరసరావుపేట రూరల్: మండలంలోని ఇస్సప్పాలెం గ్రామంలో శనివారం మహానేత డాక్టర్ వై.ఎస్.రాజశేఖరెడ్డి విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు నిర్వాహకులు శుక్రవారం తెలిపారు. ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కార్యక్రమంలో రాష్ట్ర మంత్రులు అంబటి రాంబాబు, విడదల రజినీ, పార్లమెంట్ సభ్యులు లావు శ్రీకృష్ణదేవరాయలు, ఎమ్మెల్యే కాసు పాల్గొంటారని తెలిపారు.

వరుసగా బైక్ చోరీలు

–బెంబేలెత్తుతున్న యజమానులు

నరసరావుపేట టౌన్: పార్క్ చేసిన ద్విచక్రవాహనాలను లక్ష్యంగా చేసుకొని చోరులు చేతివాటాన్ని ప్రదర్శిస్తున్నారు. గడిచిన పది రోజుల వ్యవధిలో ఏడు ద్విచక్రవాహనాలు అపహరణకు గురవ్వటం గమనార్హం. తాజాగా ఇంటి ఎదుట నిలిపిన బుల్లెట్ వాహనం ఉదయం లేచి చూసేసరికి అపహరణకు గురైంది. వివరాల్లోకెళ్తితే.. కోటప్పకొండ రోడ్డు వెంగళరెడ్డి కాలనీ 2వ లైనులో నివాసం ఉంటున్న షేక్ సైదావలి రోజు మాదిరిగానే గురువారం రాత్రి ఇంటి ఎదుట తన బుల్లెట్ ద్విచక్ర వాహనాన్ని నిలిపాడు. శుక్రవారం ఉదయం లేచి చూసే సరికి వాహనం కనిపించలేదు. పల్సర్ బైక్‌పై వచ్చిన ముగ్గురు యువకులు దర్జాగా బుల్లెట్ వాహనాన్ని అపహరించుకు వెళ్లినట్లు స్థానికులు చెబుతున్నారు. ఈ మేరకు బాధితుడు టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అదే విధంగా ఆర్టీసీ బస్టాండ్, మల్లమ్మ సెంటర్, రామిరెడ్డిపేట ప్రాంతాల్లో పార్క్ చేసిన వాహనాలను దుండగులు అపహరించుకు వెళ్లారు. అపహరించిన వాహనాల్లో ఎక్కువ శాతం బుల్లెట్ వాహనాలు ఉండటం కొసమెరుపు. చోరులు మారు తాళాలను ఉపయోగించి వాహనాలను చాకచక్యంగా అపహరిస్తున్నట్లు పోలీసులు భావిస్తున్నారు. వాహన చోరీలపై యజమానులు ఆయా స్టేషన్లలో ఇప్పటికే ఫిర్యాదు చేశారు. దీంతో దర్యాప్తు చేపట్టిన పోలీస్ అధికారులు సంఘటనా స్థలానికి సమీపంలో సీసీ పుటేజీలను పరిశీలించి నిందితులను గుర్తించే పనిలో నిమఙ్నమయ్యారు.

ఏటీఎంలో ఏమార్చి నగదు అపహరణ

యడ్లపాడు: గుర్తు తెలియని వ్యక్తి డెబిట్ కార్డును అపహరించి ఖాతా నుంచి రూ.25 వేలను డ్రా చేసుకున్న విషయం ఆలస్యంగా వెలుగు చూసింది. బాధితుడి కథనం ప్రకారం..యడ్లపాడు మండలం చెంఘీజ్‌ఖాన్‌పేటకు చెందిన గంథం రాంబాబు గతనెల 30వ తేదీన బోయపాలెం గ్రామంలోని హైవే వంతెన సెంటర్లో ఉన్న ఏటీఎం వద్ద డబ్బులు డ్రాచేసేందుకు వెళ్లాడు. అదే సమయంలో మరో యువకుడు ఉండటంతో నిరక్షరాస్యుడైన రాంబాబు తన డెబిట్ కార్డును అతనికి ఇచ్చి రూ.1000 డ్రా చేయాలని కోరాడు. దీంతో అతను రాంబాబు కార్డును మిషన్‌లో పెట్టి మినిస్టేట్‌మెంట్ తీసీ రూ.46,883 ఉన్నాయని, డ్రా చేసేందుకు డబ్బులు రావడం లేదంటూ తన చేతిలోని మారో కార్డును రాంబాబుకు ఇచ్చి అక్కడి నుంచి వెళ్లిపోయాడు. కొద్దిసేపటి తర్వాత మరోవ్యక్తికి కార్డు ఇవ్వడంతో కార్డుపై అనుమాల కోటేశ్వరరావు పేరు చూసి వెంటనే ఎస్‌బిఐకు వెళ్లి ఫిర్యాదు చేయాలని చెప్పడంతో బ్యాంకు వద్దకు వెళ్లాడు. బ్యాంక్ అధికారులను కలవగా అప్పటికే రాంబాబు ఖాతా నుంచి మూడుదఫాలు రూ.25 వేలు డ్రాచేసి ఉందని చెప్పి ఖాతాను ఫ్రీజ్ చేసినట్లు వివరించాడు. అనంతరం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసేందుకు వెళ్లాడు. మండల ప్రజలు ఏటీఎం సెంటర్లలో ఎవరికీ కార్డులు ఇవ్వడం, పిన్ నంబర్లు చెప్పకుండా అప్రమత్తంగా ఉండాలని ఎస్‌ఐ సురేష్ తెలిపారు.